మామయ్యకి భర్తను తాగుబోతుగా పరిచయం చేయడం ఇష్టంలేని సుమన ఏం చేసింది?

హిమజా రమణ
కధ

# మాస్టారు మామయ్య

"మీతో ఓ విషయం మాట్లాడాలి...."

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చిన సుధాకర్‌కు టీ అందిస్తూ చెప్పింది సుమన.

"ఏ విషయం?"

"ఈరోజు క్రిష్ణా ఎక్స్‌ప్రెస్‌కి మా మామయ్య వస్తున్నానని లెటర్ వ్రాశాడు."

సుధాకర్ తాగి క్రింద పెట్టిన టీ కప్పు వంగి చేతిలోకి తీసుకుంటూ అంది. "రానీ వోయ్... అది సరే మీ మామయ్యేంటో కంట్రాక్టులేవీ చేస్తాడు ఆయనేనా?"

"కాదు మా రెండో మామయ్య. ఆయన మాస్టారు. ఆయన మన పెళ్ళికి రాలేదు లెండి. అప్పుడాయన హృషికేష్‌లో వున్నాడు. ఆయన గురించి మీకు తెలీదు. ఆయనంటే మా బంధువులందరిలోనూ మంచి గౌరవం, భక్తి ప్రపత్తులున్నాయి."

మామయ్య గురించి ఆరాధనగా చెప్పుకుపోతూన్న సుమన ప్రసంగానికి మధ్యలోనే అడ్డువస్తూ.

"అది సరే సుమా! మాస్టారంటున్నావు గౌరవం అంటున్నావ్. అంతవరకూ బాగానే వుంది కానీ భక్తి ప్రపత్తులుండటం ఏంటి? కొంపదీసి ఆయనో బాబాలాంటి మహిమలు గలిగిన మహాపురుషుడా?"

సుధాకర్ మాటల్లోని హేళనని గ్రహించలేనంత అమాయకురాలు కాదు సుమన. బి.ఎస్.సి వరకూ చదువుకుంది. చదువుకునే రోజుల్లోనే ఏదైనా మంచి ఉద్యోగం చేయాలన్న కోరికను సుధాకర్‌కి ఇష్టం లేకపోవడం వలన చంపుకుంది.

సుధాకర్ ఎం.కామ్. ఆంధ్రాబ్యాంక్‌లో



క్యాషియర్. పెద్దల అంగీకారంతో యాభైవేల రూపాయల కట్నం తీసుకుని మరీ సుమన మెడలో తాళికట్టాడు.

సుమన సుధాకర్‌ల పెళ్ళి అయ పంవత్సరం కావస్తోంది. సుధాకర్‌లో అన్ని విషయాలూ సుమనకు నచ్చుతాయి. అతని అలవాట్లే ఆమె కిష్టంలేదు. ఆమె ఇష్టంతో సుధాకర్‌కి పట్టింపు లేదు. ఫిల్టర్ సిగరెట్లు

రోజుకి రెండుపెగ్గులు తగలేస్తాడు. అంతవ రకైతే ఎలాగో అడ్జెస్ట్ అయ్యేది కానీ రెండు పెగ్గులు 'మందు' కూడా ప్రతీ రాత్రీ పుచ్చుకుని వస్తాడు.

ఆ విషయం గురించే భర్తతో మాట్లాడా లని నిర్ణయించుకొంది సుమన. "మా మామయ్య రిటైర్డ్ అయి రెండేళ్ళు కావస్తోం ది. ఆయన ఒంటరి జీవితంలో ఏతోడూ లేకుండా కొన్ని కట్టుబాట్లలో తాను ఇమిడి పోయాడు"

"అంటే నువు చెబుతున్న దేమిటో నాకేమీ అర్థం కావటంలేదు. కాస్త అర్థమ య్యేట్లు చెప్పు సుమా?" సుధాకర్ కంఠం లో రవ్వంత అసహనం. దాన్ని గమనించి విషయాన్ని ఇక డొంక తిరుగుడు లేకుండా సూటిగా చెప్పదల్చుకుంది.

"మామయ్య బ్రహ్మచారండీ. స్కూలు టీచర్‌గా ఆయన దగ్గర పాఠాలు నేర్చుకుని చదువుకున్న ఎందరో స్టూడెంట్స్ ఈరోజు న ఐ.ఎ.ఎస్‌లుగా, డాక్టర్లుగా, ఇంజనీరులుగా , పెద్ద పెద్ద హోదాలకు వెళ్ళిన వాళ్లున్నారు వాళ్ళు అప్పుడప్పుడూ కొన్ని కొన్ని సమస్యలకు పరిష్కారాల కోసం మా మామ య్య దగ్గరికి ఇప్పటికీ వస్తూంటారు" చెప్పడం ఆపి భర్త కళ్ళల్లోకి చూసింది.

"అయితే ఆయనో గొప్ప మహానుభావు డంటావ్. ఓ దండేసి పెట్టమంటావా?"

"అలా ఎగతాళిగా మాట్లాడకండి. కనీసం . ఆయన మనింట్లో వున్నన్ని రోజులైనా. ఆ 'మందు' జోలికి పోనని నాకు మాటివ్వండి. ఇలాంటివి తన మేనకోడలింట్లో వున్నాయని తెలిస్తే ఆయనెంతగానో బాధపడతాడు. ప్లీజ్ నా కోరిక కాదనకండి. దయచేసి ఈరోజు నుంచి మీరా 'గది'లోకి వెళ్ళకండి. ..."

బజార్లలో భర్త తాగి రావడం ఇష్టంలేని సుమన ఇంట్లోనే ఒక గదిని భర్త తాగడానికి ఏర్పాటుచేసింది. భోజనానికి ముందు ఆ గదిలోకి వెళ్ళి రెండు మూడు పెగ్గుల 'మందు' బిగించి బైటకు వస్తాడు సుధాకర్, అతని దిన చర్యలలో అది ఒక భాగం.

"ఇదిగో చూడు సుమా! ఎవరో చాదస్త పు మామయ్య వస్తాడనీ, ఆయన కోసం నా అలవాట్లను మానుకోవాలని నువు చెబితే గంగిరెద్దులా తలూపడానికి నేనేం చెవిలో పూవుపెట్టుకోలేదు. మన అలవాట్లు మనవి. ఆయన రావచ్చు శుభ్రంగా నాలుగురోజులుం డి వెళ్ళవచ్చు. అయినా తాగి నేనేమైనా గొడవ చేసే లేబర్ మనిషిలా కనబడ్తున్నానా ..." అనేసి విసురుగా తన గదిలోకి వెళ్ళిపోతున్న భర్త కేసి అయోమయంగానూ ... అసహ్యంగానూ చూస్తుండిపోయింది సుమన. జరిగేదేదో జరుగుతుందిలే! అని సరిపెట్టుకోలేకపోతోంది. మామయ్య ముం దు తన భర్త ఇలాంటి త్రాగుబోతూ అని బైట పడితే ఎలా తలెత్తుకోగలదు. ఆయన తనకు చదువుచెప్పిన మాస్టారు. చదువుతో బాటు లోకజ్ఞానాన్ని, భక్తి మార్గాన్నీ ఉపదేశిం చిన గురువు. సుమనలో ఆలోచనా పరంప రలు రకరకాలుగా ఒరికీలు కొడుతున్నాయి.

* * *

ఆయన కట్టుకున్న పంచె కొద్దిగా మాసింది. వేసుకున్న చొక్కా ముడతలు పడింది. కానీ ముఖంలో మాత్రం ఏదో

తెలివి తేజస్సు. మనిషి హుందాగా, దబ్బపండు ఛాయలో వున్నాడు.

విశాలమైన ఫాలభాగాన సన్నని విలువైన తిలకం బొట్టు. ఆయన కళ్ళల్లోని చైతన్యవంతమైన కాంతి ఎదుటివారిని చురుకుగా పరిశీలిస్తుంటాయి. చిలిపిగా నవ్వుతున్నట్లూ వుంటాయి. చేతిలో పాతకాలంనాటి ముదురు గోధుమరంగు లెదర్ బ్యాగ్‌తో దిగాడు రిటైర్డ్ స్కూలు మాస్టారు కోదండరామయ్య.

రాత్రి పదకొండు గంటలు కావస్తోంది. సుమన మేలుకునే వుంది. నవ్వుతూ ఎదురెళ్ళి.

"రండి మామయ్యా చాలా రోజులకు వచ్చారు..." అంది.


"నీ పెళ్ళికి కూడా రాలేకపోయానమ్మా సుమన. అబ్బాయి ఇంట్లోనే వున్నాడా? నేనింతవరకూ మీ ఆయన్ని చూడనేలేదు కదా..."

చేతిలోని బ్యాగ్ అందించి కుర్చీలో రిలాక్స్ అవుతూ అడిగాడు కోదండ రామయ్య.

సుమన గొంతులో ఏదో మింగుడు పడని వస్తువు ఇరుక్కుపోయినట్లనిపించింది. సుధాకర్ యథాప్రకారం రెండుపెగ్గుల విస్కీ సేవించి గదిలో ఆదమరిచి మంచి నిద్రలో వున్నాడు. ఇప్పట్లో లేవడు. లేపినా ప్రయోజనంలేదు. తాగిన వారి మాటలనూ, చేష్టలనూ కనిపెట్టడం చాలా తేలిక. వచ్చీ రావడంతోనే మామయ్య దృష్టిలో భర్తను తాగుబోతుగా పరిచయం చేయడం ఇష్టంలేక.

"ఆయనీవేళ ఆఫీసులో పనెక్కువై బాగా అలిసిపోయి వచ్చి పెందరాడే భోంచేసి నిద్రపోయారు మామయ్యా. ఉదయాన పరిచయం చేస్తాను. వేన్నీళ్ళు పెడతాను స్నానం చేద్దురుగాని లేండి..."

మధ్య గదిలో విడిగా ఓ మంచం మామయ్య కోసం ఏర్పాటుచేసింది సుమన. భర్త దురలవాటుపట్ల ఆమె నరనరంలో



అసహ్యం పేరుకుపోయింది.

"వేన్నీళ్ళెందుకమ్మా? నేను చన్నీళ్ళతో నే స్నానం చేస్తాను" టవలు చుట్టుకుంటూ చెప్పాడు కోదండరామయ్య.

"ఇదసలే చలికాలం. ఇంత చలిలో చన్నీళ్ళస్నానం ఎందుకులే మామయ్యా..."

సుమన మాటలకాయన గలగలా నవ్వాడు.

"మీమామయ్య ముసలాడైపోయాడు. చలికాలంలో చన్నీళ్ళతో స్నానం చేయలేడనే గదా నీ డౌట్! నాకలాంటి భయాలేం లేవు. నాకు చిన్నప్పటినుంచీ చన్నీళ్ళే అలవాటు. ఫర్వాలేదు అవే బాత్రూంలో పెట్టు..." అన్నాడాయన. అరవై సంవత్సరాల వయసులో కూడా ఎంతో హుషారుగా, ఆరోగ్యంగా వున్న ఆయన మాటల్లో నిజంలేకపోలేదనిపించింది. తామూ నవ్వుతూ స్నానానికి ఏర్పాటుచేసింది సుమన.

తెల్లవారుజామునే శ్రీ వెంకటేశ్వరా సుప్రభాతం రాగయుక్తంగా వినిపిస్తుంటే నిద్రాభంగమైన సుధాకర్. రాత్రి తాలూకు మత్తు కళ్ళపై చన్నీళ్ళు చిలకరించుకొని మధ్యగదిలోకి వచ్చాడు. వెంకటేశ్వరస్వామి పటం ముందు ధూపదీపాలతో భక్తితో పూజచేస్తూ కనిపించాడు కోదండరామయ్య.

రెండునిముషాలపాటు తదేక ధ్యానంతో భగవన్నామస్మరణ చేస్తూ భక్తి గీతాలాపనలు చేస్తూన్న ఆయనవంక ప్రశాంతంగా చూస్తూ అలానే నిలబడిపోయాడు.

ఈ లోపల వంటగదిలోంచి హడావుడిగా వచ్చింది సుమన. ఆ రోజున ఏకాదశి కావడం వలన మామయ్య సలహాపై నైవేద్యానికి గా చెక్కెరపొంగలి చేసింది. పూజపూర్తి అయి కర్పూరం వెలిగించి ఆ కర్పూర గిన్నెతో సహా వెనుదిరిగాడు మాస్టారు. ఎదురుగా సుధాకర్ కనిపించాడు.

"రాత్రి నేను వచ్చేసరికి నువ్వు మంచి నిద్రలో వున్నావ్. హారతి కళ్ళకద్దుకో బాబూ..." అన్నాడు నుదుటన రవ్వంత దేముడి కుంకుం ధరించిన కోదండరామయ్య.

"మా సుమా వాళ్ళ మాస్టారు మామయ్య మీరే కదూ! సారీ అంకుల్ నేనింకా దంతావధానం కానివ్వలేదు. స్నానమదీ అయ్యాక వచ్చి హారతి తీసుకుంటాను"

"అమ్మాయ్ సుమనా?"

"ఏమిటి మామయ్యా?" హడావుడిగా కోదండరామయ్య దగ్గరికి వచ్చింది సుమన.

"బారెడు పొద్దెక్కింది. అబ్బాయి ఇంత వరకూ దంతావధానం కూడా కానివ్వలేదు. పైగా ఈ రోజు శనివారం, ఏకాదశి, దేముడి మీద భక్తిభావం అంతంత మాత్రంగానే వుందనుకుంటా!"

"అలాంటిదేం లేదు మామయ్యా. ఆయనకు దేముడంటే చాలా నమ్మకం. ప్రతి సంవత్సరమూ తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శించుకురావటం ఆయనకు చాలా సంవత్సరాలనుండీ అలవాటట..."

భర్తను సమర్థించుకుంటూ చెప్పింది. సుమన కళ్ళల్లోకి ఆయన లోతుగా చూశాడు. ముఖాన్ని చూసి మనసును చదువగలిగే వాళ్ళు చాలా అరుదు. అలాంటి యోగాన్ని పొందిన అతి తక్కువ మందిలో కోదండరామయ్య ఒకడు.

"చూడు సుమనా! నిన్ను ఈ చేతులతో ఎత్తుకుని ఆడించాను. ఈ చేతులతో బలపం పట్టించి ఓనమాలు దిద్దించాను. కానీ ఈ చేతులతో మనసారా ఆశీర్వదించాలని పెళ్ళికి రావాలని ప్రయత్నించి రాలేకపోయాను. కానీ ఇప్పుడు నా దగ్గర నువ్వు నిజం చెప్పకుండా భర్తగురించిన అబద్ధాలు చెబుతుంటే ఈ చేతులలో వెలుగుతున్న కర్పూరం గిన్నెవణుకుతుందమ్మా''

మాస్టారుగారి కంఠంలో లోతైన ఆవేదన స్థాణువై నిలబడిపోయింది సుమన. ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"మనిషిలో వుండే మనసు ఏదో ఓ వ్యసనానికి బానిసై తనను తాను మరిచిపోడానికీ, మొద్దుబారిపోడానికీ ఇలాంటి మత్తు పానీయాలను ఆశిస్తాయి. నీ భర్త "తాగుడుకి బానిసైపోయినట్లు, ఉబ్బిపోయిన అతని కనురెప్పలే సాక్ష్యం...''

"ఈ విషయంలో నేను ఓడిపోయాను మామయ్యా! ఆయన నా మాటలకు అన్ని విషయాలలోనూ గౌరవిస్తారు. కానీ ఆయన్ని తాగుడు మానమని ఎంత చెప్పినా వినడు. ఇంకా పిల్లా, పీచూ కలిగితే మా పరిస్థితేంటి?''

పిచ్చిపిల్లా ఎంత అమాయకంగా మాట్లాడుతున్నావ్. ఏనాడో అలవాటైపోయిన ఆ వ్యసనం ఒక్కసారిగా అతన్ని వదలాలంటే ఒదులుతుందా! అందుకు బలీయమైన ప్రత్యామ్నాయం మనసుకుతోడుగా నిలవాలి అదే భగవత్ ధ్యానం''

"మరి భార్య స్థానం?''

"తాగుడుతోడైన వాడికి ఓ మూల వుంటుంది మనసులో భార్యకు స్థానం. కొంతమందిలో ఆ స్నేహవుండదు''

"మరి దీనికి విరుగుడు లేదా మామయ్యా?'' "లేకేం! చెప్పాను కదా భగవత్ ధ్యానం.. ఆ రాఘవేంద్రస్వామి దర్శనం... అక్కడ తీసుకునే స్థిర నిర్ణయం...''


"ఆయన రాడేమో! అక్కడికి'' అనుమానం వ్యక్తం చేసింది సుమన.

"అబ్బాయితో మాట్లాడి ఒప్పించి ఆ రాఘవేంద్రస్వామి చెంతకు చేర్చే బాధ్యత నాది. నా మాటల్లో విశ్వాసముంచు...''

స్థిరమైన గొంతులోంచి వచ్చాయి కోదండరామయ్య పలుకులు.

మనసులోనే రాఘవేంద్ర స్వామిని స్మరించుకుని వంటపనిలోకి వెళ్ళిపోయింది సుమన.

హఠాత్తుగా ఆ సమయంలో కోదండరామ



## అందం

"నేను నీకెప్పుడు అందంగా, అతిలోక సుందరిలా కనిపిస్తాను డార్లింగ్!'' ప్రియుడితో చెప్పింది ప్రియురాలు.

"చీకట్లో!'' సమాధానం చెప్పాడా ప్రియుడు.

—జి.రమేష్‌బాబు (ప్రత్తిపాడు)

మ్య ఆ గదిలోకి వస్తాడని ఊహించని సుధాకర్ చేతిలోని గ్లాసు వణికింది. నిండుగా వున్న నీళ్ళల్లో కలిపిన విస్కీ కొద్దిగా తొలికింది.

"రండి మాస్టారూ... రండి..."

అన్నాడు గ్లాసు టేబుల్‌పైన పెట్టేస్తూ.

"ఫర్వాలేదు తాగేసేయ్ బాబూ! ఏదైనా కోరికను బలంగా చంపుకోవడం అంత పాపం మరొకటి వుండదంటారు" మాస్టారి మాటలకు విస్తుపోయి చూశాడు ఆయనవైపు. మాస్టారి ముఖంలో ప్రసన్నమైన చిరునవ్వు.

"అంటే మీ దృష్టిలో 'ఇది' ఏ మాత్రం తప్పుకాదా?" ఆసక్తిగా అడిగాడు.

"తప్పొప్పుల సంగతి అలావుంచు. నువ్వు దేనికోసం ఈ మందుని ఆశ్రయించావో! ముందు ఆ విషయం చెప్పు. ఎందుకంటే నీకుండే అవసరాన్ని బట్టి దీని వాడకం మంచో, చెడో తేల్చుకోవచ్చు..."

ఫలానా అంటూ ఏమీలేదు మాస్టారు. సరదాగా అలవాటైంది. ఇప్పుడు ఇది పుచ్చుకోకుంటే నిద్రపట్టడంలేదు. నాకు తెలుసు ఈ విషయంలో సుమనెంతో బాధపెడ్తున్నదని. కానీ కానీ, బలమైన ఆకర్షణతో ఇది నన్ను వశపరుచుకుంది"

సుధాకర్ ముఖంలో కొద్దిగా పశ్చాత్తాపం

"ఆ మాత్రం చాలు బాబు. అంటే ఏ విధమైన బలమైన కారణం లేకుండానే ఈ మందు నిన్ను వశపరచుకుంది. కొద్దిగా సంకల్పం వుంటే దీన్ని పూర్తిగా నీ జీవితాన్నుంచి వేరు చేయవచ్చు.

"ఎలా?"

"భగవంతునిపైన దృష్టి నిలిపితేచాలు"

"అది సాధ్యమా?"

"ప్రయత్నిస్తే తప్పేంలేదుగా. అయినా భక్తి కూడా ముదిరితే అదొకవిధమైన మత్తే"

"అయితే నన్నేం చేయమంటారు?" ఎల్లుండి ఉదయాన్నే మనం ఇరువురం మంత్రాలయం బయలుదేరుతున్నాం..." మనసులో భగవంతుని స్మరిస్తూ చెప్పాడు కోదండరామయ్య.

"నా వ్యసనం వదులుతుందో లేదో కానీ మీ మాటమీద నమ్మకంతో వస్తాను మాస్టారు."

ఏదో నిర్ణయించుకున్నవాడిలా చెప్పాడు సుధాకర్. మాస్టారి మనసు కుదుటపడింది. సుమన మనసు దూదిపింజలా తేలికపడి ఉల్లాసంగ వుంది. మామయ్య ఆమె దృష్టిలో దేముడు పంపించిన దూతలా కనిపించాడు.

సుధాకర్, కోదండరామయ్యలు అనుకున్నమాట ప్రకారం మంత్రాలయం బయలుదేరివెళ్ళారు. అక్కడి నియమనిష్టలు, ప్రశాంత వాతావరణం సుధాకర్‌లో అదోవిధమైన దివ్యానుభూతినిచ్చాయి. రెండుపూటలు అక్కడ భగవంతుని దర్శనం చేసుకున్న తర్వాత సుధాకర్‌లో చాలా మార్పువచ్చింది.

"మాస్టారూ... మీరు నా జీవితానికి చూపించిన మార్గం మరిచిపోలేను. నాకిప్పు

దు ఏ విధమైన దుర్వ్యసనం గుర్తుకురావడం లేదు. సదా భగవంతుని స్మరిస్తూ ఇక్కడే వుండిపోవాలనిపిస్తోంది...''

ఏదో మైకంలో వున్నట్లు మాట్లాడుతున్న సుధాకర్‌లోని మార్పు కోదండరామయ్యకు కొండంత తృప్తినిచ్చింది. అదేరోజు రాత్రి బస్‌లో తిరుగుప్రయాణమయ్యారు. అర్ధరాత్రి బస్ ప్రయాణం.. చీకటిని చీల్చుకుంటూ బస్ దూసుకుపోతున్నది. ఏమైందో ఏమో బస్ పేలిపోయినంత ధ్వని బస్ ఎదురుగా వస్తున్న లారీని గుద్దేసింది.

బెడ్‌పైన నెమ్మదినెమ్మదిగా కళ్ళు తెరిచాడు సుధాకర్. ఒళ్ళంతా బిగించి కట్టిన కట్లు, సూదులతో పొడుస్తున్నట్లున్న బాధ. మంచం చుట్టూ సుమన, వాళ్ళ కుటుంబ సభ్యులు ఇటుప్రక్కన సుధాకర్ వాళ్ళ కుటుంబ సభ్యులు. సుధాకర్ రెండురోజులు స్పృహలోవుండి అప్పుడే కళ్ళు తెరిచాడు. ఆ ఆనందం అందరిముఖాలలోనూ కనిపిస్తోంది. సుమన కళ్ళల్లో ఆగకుండా ఊరుతున్న నీరు.

"మాస్టారు... మాస్టారు... గారికెలా వుంది?'' నూతిలోంచి వస్తున్నట్లుంది సుధాకర్ గొంతు. ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు. సుమన తల్లి పైట చెంగును నోట్లో కుక్కుకుని ఏడుపుని బలవంతంగా ఆపుకొంటూంది.

"సుమా! మీ మాస్టారు మామయ్య ఎక్కడ?'' ఈసారి కొద్దిగా ఆవేశంగా అడిగాడు.

"మామయ్య... మామయ్య! దేముడి దగ్గరికెళ్ళిపోయాడండీ...''
బావురుమంటూ ఏడుస్తూ చెప్పింది. అందరి కళ్ళల్లోనూ నీళ్ళుతిరిగాయి.

"ఏ వ్యసనం నుంచి నువ్వు బాగుపడతావ్! ఆ నమ్మకం నాకుంది బాబూ... అంటూ లీలగా గాలిలో మాస్టారు చెబుతున్నట్లే వుంది సుధాకర్‌కు.

*

## ముక్కు కొరికిన ప్రొఫెసర్



నైజీరియాలోని నాగోవ్ పట్టణంలో ఆపోలో జాలో అనే ప్రొఫెసర్ ఉన్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు! పన్నెండు మంది పిల్లలు. అయితే మొన్నీమధ్యన ఓ రోజున అతడి చిన్న భార్య ఈప్తర తన విద్యార్థి దాంజుమాతో కలిసి వెళ్లటం చూసి అగ్గిబుగ్గైపోయి... అతగాడ్ని ఆపి ముక్కును కసిగా కొరికేసాడట!

రక్తంతో తడిసిముద్దైన ముక్కును దాంజుమా పోలీసులకు చూపించటంతో ప్రొఫెసర్‌గారికి కోర్టు సంవత్సరంపాటు జైలు శిక్షతోపాటు వేయి నైరాలు (2250 రూపాయలు) జరిమానా కూడా విధించింది! పాపం... ప్రొఫెసర్!

—జాపేటర్